ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో బోరింగ్ మిషన్ వద్ద పైపులను కట్టర్ ద్వారా తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కూలిన చోట పేరుక పోయిన మట్టిదిబ్బలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో బురదను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది

ఆ 8 మంది జాడ దొరికింది.. కానీ..

మిషన్ జీపీఆర్‌తో ఐదు స్పాట్ల గుర్తింపు • క్షణక్షణం ఉత్కంఠభరితంగా అన్వేషణ

- బురద తొలగింపునకు మరో వారం పట్టే అవకాశం
- కార్మికుల ఆచూకీపై నేడు ప్రకటన?
- ఆ స్పాట్లు గుర్తించామనేది అబద్ధం : కలెక్టర్ సంతోష్
- ఎన్‌డీఆర్‌ఐ స్పాట్లు ఐడెంటిఫై చేసింది : ఎస్పీ, సింగరేణి సీఎండీ
- విరుద్ధ ప్రకటనలతో అయోమయం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల జాడను కనిపెట్టే రెస్క్యూ ఆపరేషన్ ఒక కొలిక్కి వచ్చినట్టు తెలుస్తున్నది. శుక్రవారం నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 'గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్' (జీపీఆర్) పరికరంతో కార్మికులు చిక్కుకున్న ప్రదేశాన్ని గుర్తించినట్టు తెలుస్తున్నది. రెస్క్యూ బృందాలు శుక్రవారం తెల్లవారుజాము నుంచి జీపీఆర్ ద్వారా జీరో పాయింట్ వరకు చేరుకొని ఆ ప్రదేశమంతా స్కానింగ్ చేశారు. ఈ రిపోర్టును పరీక్షించిన అనంతరం కార్మికులు ఐదు స్పాట్లలో చిక్కుకొని ఉంటారనే ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలుస్తున్నది. మరోసారి క్రాస్‌చెక్ చేసుకున్న బృందం ఇది నిజమేనన్న నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. మరోవైపు, గత 36 గంటలుగా విరామం లేకుండా రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతున్నది. ఇప్పటికే అక్కడ ఉన్న 11 బృందాలతోపాటు తాజాగా కొత్తగూడెం నుంచి అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న సింగరేణికి చెందిన అనుభవజ్ఞులైన కార్మికులను రప్పించారు. ఎన్‌డీఆర్‌ఐ గుర్తించిన స్పాట్ల వద్ద శుక్రవారం ఎన్‌డీఆర్‌ఐ, ర్యాట్‌మైనర్స్ టీం, సింగరేణి బృందంతో హైలెవెల్ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగుసార్లు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన అనంతరం శనివారం వరకు కార్మికుల ఆచూకీని కనుక్కోవాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో సొరంగం వద్ద హడావుడి మొదలైంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు మీడియా ప్రతినిధుల రాకపై పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించారు.

జీపీఆర్‌తో పలుమార్లు స్కానింగ్

భూమిలో కూరుకుపోయిన వారి ఆచూకీని కనిపెట్టే జీపీఆర్ మిషన్‌తో ఉదయం లోపలికి వెళ్లిన ప్రత్యేక బృందం అతికష్టం మీద సాయంత్రానికి లోపలికి చేరుకొని అనేకసార్లు స్కాన్ చేసింది. ఆ ప్రదేశం ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ, ప్రాణాలకు లెక్కచేయకుండా కచ్చితమైన ఫలితాలను రాబట్టినట్టు తెలుస్తున్నది. ఈ బృందం కార్మికులు చిక్కుకున్నట్టు అనుమానిస్తున్న ఐదు స్పాట్లను గుర్తించి బయటకొచ్చింది. లోపల స్కాన్ చేసి తెచ్చిన రిపోర్టును పరిశీలించి ఆ ఐదు స్పాట్లలోనే కార్మికులు ఉండి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నివేదిక రాగానే విపత్తు నిర్వహణ చీఫ్ కమిషనర్ అర్వింద్‌కుమార్ నేతృత్వంలో ఉన్నతస్థాయి బృందంతో సమీక్ష నిర్వహించారు. గుర్తించిన స్పాట్లపై మార్కింగ్ చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. తిరిగి లోపలికి వెళ్లిన బృందం ఆ స్పాట్లను పరిశీలిస్తున్నది. మార్కింగ్ తర్వాత బురదను తవ్వుతూ తప్పిపోయిన వారి ఆచూకీ కోసం ఆర్మీ, నేవీ, సింగరేణి టీంను అక్కడికి యుద్ధ ప్రాతిపదికన పంపించారు. శనివారం మధ్యాహ్నం వరకు కార్మికుల ఆచూకీ దొరుకుతుందని భావిస్తున్నట్టు పేరు చెప్పడానికి ఇష్టపడని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

మిషన్‌ను తొలగించాలంటే మరో వారం

టన్నెల్‌లో అడ్డంగా పడి ఉన్న టీబీఎం మిషన్‌తోపాటు పేరుకుపోయిన మొత్తం బురదను తొలగించాలంటే వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం టీబీఎం మిషన్‌ను కటింగ్ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. మరోవైపు, సొరంగంలో 12 కిలోమీటర్ల వరకు మాత్రమే లోకోట్రైన్ వెళ్తుంది. అక్కడినుంచి విద్యుత్తు సౌకర్యం పునరుద్ధరించే సామగ్రిని, మిషనరీని పట్టుకొని రెస్క్యూ బృందాలు రెండు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఆక్సిజన్ లెవెల్స్ చాలా తక్కువగా ఉండటంతోపాటు చేతుల్లో భారీ మిషనరీలతో అక్కడికి వెళ్లడం సాధ్యం కాకపోవడంతో దశలవారీగా వాటిని లోపలికి పంపించారు. దీంతో సహాయక చర్యలు ఆలస్యమవుతున్నాయి. విపక్షాలనుంచి, చిక్కుకున్న కార్మికుల బంధువుల నుంచి విమర్శలు ఎక్కువ కావడంతో కార్మికుల జాడను తెలుసుకునేందుకు జీపీఆర్ టెక్నాలజీ వైపు మొగ్గుచూపారు.

నేడు కొలిక్కి వచ్చే అవకాశం

జీపీఆర్ఎస్ ద్వారా కార్మికుల జాడను గుర్తించడంతో ఇక రెస్క్యూ ఆపరేషన్ సులభంగా మారింది. అక్కడ మట్టి, పేరుకుపోయిన బురదను ఏ విధంగా తొలగించాలనే దానిపై ఉన్నతాధికారులు రెస్క్యూ బృందాలకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో వెంటవెంటనే ఆ బృందాలను లోపలికి పంపించారు. స్పాట్లను మార్కింగ్ చేయడంతోపాటు తవ్వడం కూడా ప్రారంభించినట్టు తెలుస్తున్నది. శనివారం తెల్లవారుజాము లేదా మధ్యాహ్నం వరకు చిక్కుకున్న వారందరినీ బయటకు తీస్తామన్న ధీమాతో ఉన్నారు.

సొరంగం వద్ద ఉద్విగ్న క్షణాలు

సొరంగంలో ప్రమాదం జరిగిన 14వ కిలోమీటర్ వద్ద రిఫ్లెక్టెడ్ తరంగాలను పంపించడం ద్వారా మట్టిలో కూరుకుపోయిన కార్మికుల ఆనవాళ్లను గుర్తించడంతో సహాయక చర్యలు చేపట్టిన బృందాలు ఊపిరి పీల్చుకున్నాయి. దీంతో ఆ స్పాట్లలోనే తవ్వి తీయాలని ఉన్నతాధికారులు హుటాహుటిన నిర్ణయం తీసుకున్నారు. టీబీఎం ముందుభాగంలో అయిదు గురి ఆనవాళ్లు లభించినట్టు తెలుస్తున్నది. దానికి సమీపంలోనే మరో ముగ్గురు ఉండి ఉంటారని అనుమానిస్తున్నారు. కాగా, రెండురోజులుగా రెస్క్యూ బృందాలు నిర్విరామంగా పనిచేస్తున్నాయి. సొరంగం లోపల ఆశించిన స్థాయిలో ఫలితం వచ్చే అవకాశం లేదని భావించి ప్రమాదం జరిగిన స్పాట్‌పై ఫోకస్ పెట్టారు. ఎట్టకేలకు ఏడు రోజుల తర్వాత ఫలితం కనిపించడంతో సొరంగం వద్ద ఉద్విగ్న వాతావరణం నెలకొన్నది.

ఆ స్పాట్లు గుర్తించలేదు : కలెక్టర్ సంతోష్

ఐదు స్పాట్లు గుర్తించినట్టు మీడియాలో వస్తున్న సమాచారం పూర్తిగా అబద్ధమని, అయితే, ఎన్జీఆర్‌ఐ ద్వారా జీపీఆర్ స్కానింగ్ చేసిన మాట వాస్తవమేనని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ మీడియాతో చెప్పారు. ప్రమాదం జరిగిన చోట ఈ మిషన్ ద్వారా స్కానింగ్ చేసిన రిపోర్టులు పరిశీలిస్తున్నామని తెలిపారు. అధికారికంగా ప్రకటించక ముందే కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా చానళ్లలో మాదిరిగా లేనిపోనివి ప్రచారం చేయవద్దని కోరారు. అయితే, ఎన్‌డీఆర్‌ఐ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ప్రకారం ఐదు స్పాట్లు గుర్తించిన విషయం వాస్తవమేనని సింగరేణి సీఎండీ బలరాం, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ మీడియా ప్రతినిధుల ముందు వెల్లడించారు. దీంతో ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. మరోవైపు, మీడియాలో బ్రేకింగ్ న్యూస్ రావడంతో షాక్ తిన్న సర్కార్ అదంతా అబద్ధమని కలెక్టర్‌తో చెప్పించినట్టు ప్రచారం జరుగుతున్నది. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తనకు తెలియకుండా మీడియాకు ఎలా లీక్ చేశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారని చర్చించుకుంటున్నారు. రోజూ ఉదయమే హెలికాప్టర్‌లో వస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మాత్రం రాలేదు.

శిథిలాల తరలింపు ఆశామాషీ కాదు

గ్రౌంటింగ్‌తో రాతిలా మారిన సొరంగం భూమిపొరలు

దాదాపు 3 లక్షల క్యూబిక్ మీటర్ల సిమెంట్ గ్రౌటింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం సంభవించి ఏడు రోజులు గడిచాయి. ఆర్మీ, నేవీ, ర్యాట్ మైనర్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ బృందాలు కూడా సహాయక చర్యలను చేపట్టాయి. అయితే, సొరంగంలోని మట్టి, రాళ్లు, బురద, శిథిలాలను తొలగించడం అంత అషామాషీ కాదని తెలుస్తున్నది. సొరంగం తవ్వకం సమయంలో చేసిన గ్రౌటింగ్ కూడా ప్రస్తుతం సమస్యగా మారిందని ఇంజినీరింగ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ టన్నెల్‌లో ప్రస్తుతం పనులు కొనసాగుతున్న 14వ కిలోమీటర్ వద్ద దాదాపు ఎనిమిది మీటర్ల పొడవుతో షియర్‌జోన్ ఉన్నట్టు గుర్తించారు. భూమి పొరల్లో భౌతిక ఒత్తిళ్లకు గురై, రాళ్ల భాగాలు ఒకదానికొకటి వ్యత్యాసంగా తేలికగా సర్దుబాటవడం, రాతి ఆకృతులు మారిపోవడం, చీలికలు ఏర్పడి పూర్తిగా పటుత్వాన్ని కోల్పోయి ఉన్నాయని గుర్తించారు. ఆ పగుళ్లను పూడ్చివేసి, నీటి ఊటను నిరోధించేందుకు గ్రౌటింగ్ చేస్తారు. అంటే సిమెంట్‌తోపాటు సోడియం సిలికేట్, పాలీయురెతేన్, ఎపోగ్లిస్ తదితర రసాయనాల సమ్మేళనాన్ని భూమి, రాతిపొరల పగుళ్లలోకి ప్రెషర్‌తో పంపింగ్ చేస్తారు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలో దాదాపు ఎనిమిది మీటర్ల పొడువునా ఆ జోన్ ఉండగా, ఆ మేరకు అధికారులు దాదాపు మూడు లక్షల క్యూబిక్‌మీటర్ల మేర సిమెంట్ గ్రౌటింగ్ చేశారు. అది పని చేయకపోవడంతో కెమికల్ గ్రౌటింగ్ కూడా నిర్వహించారు. అయినప్పటికీ నీటి ఊటను నిర్దేశిత మోతాదులో నిరోధించలేకపోయారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలోనే సొరంగం కూలిపోయింది. ఇక టన్నెల్‌లో కన్వేయర్ బెల్ట్, లొకోపైలట్ ట్రాక్ మరమ్మతుల తర్వాతే శిథిలాల తరలింపు ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది.

టీబీఎం కటింగ్‌కు ఒప్పుకోని కంపెనీ!

- అందుకే సహాయ చర్యల్లో ఆలస్యం?
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సర్కార్ వర్సెస్ కంపెనీ ఒప్పందాలు

మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొని రావడానికి అడ్డుగా ఉన్న టీబీఎం మిషన్‌ను కట్ చేయాలనే విషయంపై సర్కార్‌కు, జేపీ కంపెనీ ప్రతినిధులకు మధ్య పొంతన కుదరలేదన్న వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సదరు కంపెనీ మిషన్ కటింగ్‌కు ఒప్పుకోకపోవడంతో సహాయక చర్యల్లో ప్రతిష్ఠంభణ ఏర్పడిందా? చివరకు సర్కారుకు, కంపెనీ ప్రతినిధులకు మధ్య ఒప్పందం కుదిరిందా? అందుకే హడావిడిగా డిప్యూటీ సీఎంను పంపించి ఇద్దరు మంత్రులతో బేరసారాలకు దిగారా? అనే దానిపై ఆసక్తికర చర్చ జరుగుతున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగం గత శనివారం ఉదయం కుప్పకూలింది. అప్పటికే ఉబికి వస్తున్న ఊట నీరు కారణంగా సొరంగం కూలే అవకాశం ఉన్నదని భావించిన కార్మికులు లోపలికి వెళ్లి పనిచేయడానికి ఒప్పుకోకపోతే బలవంతంగా లోపలికి తీసుకువెళ్లారు. అసలు లోపలికి ఎంతమందిని తీసుకెళ్లారనే దానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. ఆ రోజు సొరంగం పనులు చేయడానికి వెళ్లిన కార్మికులు ఎంతమంది? రిజిస్టర్‌లో ఎంట్రీలు చేశారా? అక్కడ పనిచేస్తున్న వారి విషయంలో సేఫ్టీ మేజర్స్ ఎందుకు పాటించలేదు? అనే ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. ఇటీవల ఒక ప్రజాసంఘం నాయకులు కార్మికులు ఉంటున్న క్యాంపుల దగ్గరికి వచ్చారు. ఆ తర్వాత కంపెనీ దగ్గర వివరాలు సేకరించారు. ఇటు కార్మికులు, అటు కంపెనీ చెప్పున్న లెక్కలకు పొంతన కుదరడం లేదు. కార్మిక చట్టాలను ఉల్లంఘించి, వారికి కనీస సౌకర్యాలు కల్పించకుండా బలవంతంగా పనుల్లోకి తీసుకెళ్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

10 గంటల్లో రెండో హెలిప్యాడ్!

నిర్మాణ సంస్థ కంపెనీ, మంత్రి ఉత్తమ్ కోసం ఆగమేఘాల మీద సిద్ధం

సహాయ చర్యల్లో మాత్రం తాత్సారం

మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో నిర్మాణ సంస్థ కంపెనీ ప్రతినిధి కోసం కేవలం పది గంటల్లోనే హెలిప్యాడ్‌ను సిద్ధం చేయడం చర్చనీయాంశంగా మారింది. సొరంగం పనులు చేపడుతున్న కంపెనీ యజమానులు సొంతంగా ఇక్కడ తొలుత ఒక హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే, ప్రతిరోజూ హెలికాప్టర్‌లో ఇక్కడకు వస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఇదే హెలిప్యాడ్ వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం నిర్మాణ సంస్థ అధినేత ఇక్కడికి వచ్చారు. అప్పటికే మంత్రి ఉత్తమ్ హెలికాప్టర్ అక్కడ ఆగి ఉన్నది. దీంతో మంత్రి హెలికాప్టర్‌ను టేక్ ఆఫ్ చేయించగా, కంపెనీ యజమాని హెలికాప్టర్ వచ్చి ఆగింది. హెలికాప్టర్ నుంచి యజమాని దిగగానే.. ఆ హెలికాప్టర్ గాల్లోకి లేచింది. అప్పటికే గాల్లో చక్కర్లు కొడుతున్న మంత్రి హెలికాప్టర్ అక్కడికి వచ్చి ల్యాండ్ అయింది. దీంతో కంపెనీ యాజమాన్యం తన కోసం 10 గంటల్లో ఇంకో హెలిప్యాడ్‌ను రెడీ చేసుకున్నది. ప్రమాదం జరిగి ఎనిమిది రోజులైనా చిక్కుకున్నవారి జాడను మాత్రం కనిపెట్టలేకపోయారంటూ స్థానికులు మండిపడుతున్నారు.

విశ్వ ప్రయత్నం... విషాదాంతం!

ఎనిమిది మృతదేహాలు వెలికితీత?

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం విషాదాంతంగా ముగిసింది. సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది శుక్రవారం అర్ధరాత్రి వెలికితీసినట్టు తెలుస్తున్నది. అయితే, అధికారికంగా దీనిని ధ్రువీకరించడం లేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించేందుకు ఏర్పాట్లుచేసినట్టు సమాచారం. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖాన డాక్టర్లను అందుబాటులో ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు తెలుస్తున్నది. డ్యూటీ డాక్టర్లను కూడా రాత్రికి రాత్రి రప్పించారు. సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు.

FORM-IV

STATEMENT OF OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT **NAMASTE TELANGANA**

1.	Place of Publication	:	**HYDERABAD**
2.	Periodicity of its Publication	:	Daily
3.	Printer's name	:	**DAMODAR RAO DIVAKONDA**
	Nationality	:	Indian
	Address	:	Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Medchal-Malkajigiri District - 500 078. Telangana State.
4.	Publisher's Name	:	**DAMODAR RAO DIVAKONDA**
	Nationality	:	Indian
	Address	:	Telangana Publications Pvt. Ltd, 8-2-603/1/7,8,9, Krishnapuram, Rd.No.10, Banjara Hills, Hyderabad - 500 034. Telangana State.
5.	Editor's Name	:	**THIGULLA KRISHNA MURTHY**
	Nationality	:	Indian
	Address	:	29 - 1405/207A, West Deendayal Nagar, Neredmet, Near Nagendra School, Malkajigiri, Hyderabad. Telangana State.
6.	Name and addresses of the individuals who own the Newspaper and partners or Shareholders holding more than one percent of the total Capital	:	Sri **D. Damodar Rao** Flat No. 4B, Indra Prastha, Rajbhavan Road, Somajiguda, Hyderabad - 500 082. Telangana State. Sri **K. Chandra Shekhar Rao** H.No. 8-2-220/110/1/3, Road No.14, Nandi Nagar, Banjara Hills, Hyderabad - 500 034. Telangana State. M/s **PACT BROKERAGE LIMITED** Plot No. 213, 3rd Floor, Road No.1, Film Nagar, Hyderabad - 500 096. Telangana State.

I, Damodar Rao Divakonda, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
DAMODAR RAO DIVAKONDA
Publisher

Date: March 1, 2025

మృత్యు సొరంగం.. బతుకు దుర్భరం

- ఎస్ఎల్‌బీసీ కార్మికులకు దినదిన గండం
- రేకుల షెడ్డులో 150 మంది జీవనం
- గదిలో 10 మంది.. 3 తంతెల రేకుల బెడ్లు
- కట్టెలు కొట్టుకొస్తేనే వంట.. మధ్యాహ్నం షిఫ్ట్ వాళ్లదే బాధ్యత
- 8 గంటల పనికి కేవలం రూ.450 కూలి
- శ్రమదోపిడీ.. మూన్నెళ్లుగా అందని జీతం
- కండ్లనిండా నీళ్లతో ఇప్పటికే 130 మంది సొంతూర్లకు

ఎస్ఎల్‌బీసీలో పని కోసం పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన కార్మికులు నివాసం ఉండే రేకుల షెడ్లు

వాళ్లంతా పొట్ట చేతపట్టుకొని రాష్ట్రం దాటి ఇక్కడికి వచ్చారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కుదిరారు. టన్నెల్‌లో దినదిన గండంగా సాగే వారి పనులు ఒకెత్తయితే.. ఎలాంటి వసతులూ లేకుండా అక్కడ బతుకెళ్లదీస్తుండటం మరోఎత్తు. తుప్పుపట్టిన రేకుల షెడ్డులో 150 మంది కార్మికులు నివాసముంటున్నారు. ఒక్కో గదిలో పది మందిదాకా నక్కినక్కి గడుపుతున్నారు. తంతెలవారీగా రేకులు అడ్డంపెట్టి కట్టిన బెడ్లలో కంటికి చాలని కునుకుతీస్తూ బతుకుజీవుడా అంటూ నెట్టుకొస్తున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : జార్ఖండ్‌లోని అత్యంత వెనుకబడిన కార్మిక కుటుంబాలవి. రెక్కాడితేగాని డొక్కాడని జీవితాలు వారివి. రోజుకు రూ.450 కూలి ఇస్తామంటే జార్ఖండ్ నుంచి 1500 కిలోమీటర్లు పొట్టచేతపట్టుకొని దోమలపెంటకు వచ్చారంటే వారెంత దీనావస్థలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. అలాంటి అమాయకుల బతుకులను శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) అనే మృత్యుకుహరంలోకి నెట్టాయి కాంగ్రెస్ ప్రభుత్వం.. నిర్మాణ సంస్థ అయిన జేపీ అసోసియేట్స్. ఇక్కడికి వచ్చిన దగ్గర్నుంచి వారి పరిస్థితి 'లోపల మృత్యు కుహరం.. బయట నరకకూపం' అన్నట్టుగా ఉన్నది. రోజుకు మూడు షిఫ్టులు. ఓపిక ఉన్న కార్మికులు ఓటీ చేస్తే.. పది గంటల పనికి వచ్చే కూలి రూ.600! కార్మిక చట్టాలే తల దించుకునేంత శ్రమ దోపిడీ జరుగుతున్నా నోరెత్తి ప్రశ్నించలేని వెతలు వారివి.

నరకకూపంలా రేకుల షెడ్డు

కార్మికుల వసతి కోసం జేపీ అసోసియేట్స్ కంపెనీ ఎప్పుడో నిర్మించిన తుప్పు పట్టిన రేకుల షెడ్డులోనే సుమారు 150 మందికి పైగా కార్మికులు కాలం వెళ్లదీస్తున్నారు. ఒక్కో షిఫ్టునకు 50 మంది విధుల్లో ఉండాలి. మూడు షిఫ్టుల్లో సుమారు 14 కిలోమీటర్ల మేర ఎస్ఎల్‌బీసీ సొరంగంలోకి వెళ్లి శ్రమను ధారపోసి మృత్యుకుహరం నుంచి వచ్చి బయట నరకకూపంలో అడుగుపెడుతున్నారు. ఆ రేకుల షెడ్డులో 150 మందికి సరిపడా వసతుల్లేవు. ఒక్కో గదిలో 8 నుంచి 10 మంది సర్దుకుపోతున్నారు. రేకులను అడ్డం పెట్టుకొని గదులను వారే తయారు చేసుకున్నారు. ఒక్కో గదిలో మూడు తంతెలు వేసుకొని, రేకులతో బెడ్‌గా రూపొందించుకున్నారు. డ్యూటీకి వెళ్లొచ్చిన తర్వాత అన్నం ఉంటే తింటారు.. లేదంటే పస్తులుంటారు. ఇక రాత్రయితే అడవిలోని దోమలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కనీసం వంటగ్యాస్ సౌకర్యం కూడా లేకపోవడంతో అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకొచ్చుకొని వంట చేసుకుంటున్నారు. మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లేవారు, రాత్రికి డ్యూటీకి వెళ్లాల్సిన వారిదే వంట బాధ్యత. మిగతా కార్మికులు ప్రాజెక్టుకు దగ్గర్లోని దోమలపెంటకు 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి వంట సామాను తెస్తారు. అప్పుడెప్పుడో కట్టించిన మరుగుదొడ్లు పూర్తిగా పాడయ్యాయి. బయలుకొస్తే అడవిలోకి వెళ్లాల్సిందే. కనీసం స్నానాలు చేసేందుకూ వసతులు లేవు.

అంబులెన్స్, వైద్యానికీ డబ్బులు!

టన్నెల్‌లో పనిచేసే చోట, రేకుల షెడ్డులో, అడవిలో ఏవైనా దెబ్బలు తగిలితే వెంటనే జయ్‌పీ కంపెనీ తమ అంబులెన్స్‌ను పంపిస్తుందట! అయితే, ఆ అంబులెన్స్‌కు, చేసిన వైద్యానికి కూడా కార్మికులే డబ్బు చెల్లించాలట! ఇక ఏదైనా సీజనల్ రోగాలొస్తే తమను డబ్బులకు పీల్చి పిప్పి చేస్తున్నారని కార్మికులు చెప్తున్నారు. ఈ దారుణాలేవీ పైస్థాయిలో ఉన్నవారికి తెలియనివ్వరని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

3 నెలలుగా వేతనం పెండింగ్

ఇంతలా శ్రమ దోపిడీ చేస్తున్న కంపెనీ మూడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వలేదని, అడిగితే భయపెడుతున్నారని కార్మికులు వాపోతున్నారు. 'మావాళ్లను పోగొట్టుకున్నం.. మాకు రావల్సిన వేతనాలు ఇప్పిస్తే.. ఇప్పుడే ఇంటికి వెళ్లిపోతం' అంటూ వేడుకుంటున్నారు.

బతుకుజీవుడా' అంటూ సొంతూళ్లకు

తోటి కార్మికులు కళ్లముందే మట్టిలో గల్లంతవడంతో ఆ దృశ్యాలను చూసి భయకంపితులైన కొందరు కార్మికులు 'బతుకు జీవుడా' అంటూ ఉన్న డబ్బుతో సొంతూళ్లకు వెళ్లారు. ఇప్పటికే సుమారు 130 మంది జార్ఖండ్‌కు వెళ్లిపోయినట్టు తెలిసింది. ఈ ప్రమాదం గురించి వార్తల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు చార్జీలకు డబ్బులు ఫోన్‌పే చేయడంతో ఇక్కడ్నుంచి వెళ్లిపోయారు. ఇక మిగిలిన 20 మంది కార్మికులు సొంతూరికి వెళ్లేందుకు డబ్బులేక ఇక్కడే ఉన్నట్టు తెలిసింది. వారిని రెస్క్యూ సిబ్బందికి సహాయంగా ఉండాలని అధికారులు చెప్పారని, ఇంత ప్రమాదం జరుగుతున్నా.. మళ్లీ పనికి పిలుస్తున్నారని, వెళ్లేందుకు తాము సిద్ధంగా లేమని కార్మికులు అంటున్నారు.

టన్నెల్‌లో ఏం జరుగుతున్నదో తెలియడం లేదు

గద్వాల, ఫిబ్రవరి 28: మా బిడ్డ ఆపరేటర్‌గా ఇదే టన్నెల్‌లో పనిచేస్తున్నడు. ప్రమాదంలో చిక్కుకొని వారం అవుతున్నది. ఇప్పటికీ ఎలాంటి ఆచూకీ లేదు. టన్నెల్‌లో అసలేం జరుగుతున్నదో మాకు అర్థం కావడం లేదు. మమ్మల్ని లోపలికి పంపాలని ఎంత వేడుకున్నా కలెక్టర్ సారు ఒప్పుకోవడం లేదంటూ సిబ్బంది పంపట్లేదు. బిడ్డ ఎప్పుడొస్తడని గురుప్రీత్‌సింగ్ తల్లి, నాన్నెప్పుడొస్తడని ఇద్దరు ఆడపిల్లలు, కట్టుకున్నోడి రాక కోసం భార్య.. ఇంట్లో అందరూ ఏడుస్తూ ఎదురు చూస్తున్నరు. ఇల్లంతా కునుకు లేదు.. తిండి లేదు. ప్రభుత్వం సహాయక చర్యలు మరింత వేగం చేయాలి.

–కల్వంత్‌సింగ్, సొరంగంలో చిక్కుకున్న గురుప్రీత్‌సింగ్ బాబాయి, పంజాబ్

మా వాళ్లు వద్దన్నా.. తీస్కపోయిండ్రు

మేం డ్యూటీకి వెళ్తుండగానే టన్నెల్ పైనుంచి మట్టి, నీరు లీకవుతున్నాయని లోపలికి వెళ్లవద్దని రాతి షిఫ్ట్ వారు మాకు చెప్పారు. అటువంటిదేమీ లేదని, అవి చాలా సహజమని అధికారులు వచ్చి చెప్పి మా వాళ్లను పనికి తీసుకెళ్లారు. వాళ్లు అనుకోని ప్రమాదానికి గురై ఆ టన్నెల్‌లోనే ప్రాణాలు కోల్పోయారని మాకు ఇప్పటికే అర్థమమైంది. అక్కడ ముందుగా మట్టి పడడం మొదలైంది. ఆ తర్వాత నీరు బయటకు వచ్చింది. అప్పటికే మాకు భయమైంది. పెద్ద శబ్దం వస్తుండటంతో మేము ముగ్గురం కలిసి భయంతో ఉరుకుతూ బయటికి వచ్చినం. మా వాళ్లు చెప్పినా అధికారులు వినలేదు. అందుకే పెద్దనష్టం జరిగింది.

– బిశ్వజిత్ సాహు, కార్మికుడు, జార్ఖండ్

దేవుడి మీదే భారం వేసినం

ప్రమాదం జరిగి ఇన్నిరోజులైనా కనీసం తట్టెడు మట్టి బయటికి తీయకపోవడం మమ్మల్ని బాగా బాధిస్తున్నది. మా వాళ్లు బతికి ఉండటం కష్టమే. ఇంతపెద్ద టన్నెల్‌లో పనిచేసే వారికి ముందుగా ట్రైనింగ్ ఇస్తారు. మాకు అలాంటిదేమీ ఇవ్వలేదు. పనిచేసేటప్పుడు మేము రోజూ దేవుడి మీదే భారం వేస్తున్నం. మొదట భయపడ్డా తర్వాత అలవాటైంది. కానీ ఈ ప్రమాదంలో మాతోపాటు పని చేసిన వాళ్లు గల్లంతవడం తట్టుకోలేకపోతున్నం. వాళ్లను బతికించే ప్రయత్నాలు సరిగ్గా చేయలేదు.

– విజయ్ సిన్హా, కార్మికుడు, జార్ఖండ్